## పోటీ - by సునీల్ దొడ్డపనేని

Back Home

ప్రపంచం లో అడుగడుగునా పోటీ, ఎటు చూసినా పోటీ. పోటీ అంటే తెలియని వారు ఉంటారని నేను అనుకోను. అయితే పోటీల్లో చాల రకాలున్నాయండోయ్. "సమాజం నన్ను చిన్న చూపు చూసింది, సమాజానికి నేనేంటో చూపిస్తాను" అంటూ బయలుదేరతాడు చాలా సినిమాల్లో మన హీరో గారు. అలాంటిదే, కొంచెం తేడాతో, ప్రేమించుకున్నాం సమాజానికి మేమేంటో చూపిస్తాం" అంటుంటారు మన హీరో హీరోయిన్లు. ఇలాంటి సమాజం మీద పోటీలు సాధారణంగా సినిమాల్లో ఎక్కువ కనిపిస్తున్నా బయట కూడా కొద్దో గొప్పో జరుగుతుంటాయని నా అభిప్రాయమూ, అనుభవమూను.

ఇక పోతే పిల్లల మధ్య పోటీ. అది ఏనాడూ శృతి మించదు, అవతలి వారి చెడుని కోరుకోదు. అసలు ప్రమాదమంతా పెరిగిన పెద్ద మనుషుల మధ్య పెరిగే పోటి తోనే. మొన్నీమధ్య క్రొత్తగా కాపురం పెట్టిన స్నేహితుడి ఇంటికి భోజనానికి వెళ్ళాను. మామూలుగా మాటల మధ్య, భవిష్యత్తులో ఉపయోగపడుతుంది కదా అని, "మీరే మీ అనుకోనంటే ఒక చిన్న విషయం (నాకసలే మొహమాటం ఎక్కువ లేండి), మీకు నెలకి ఎంత ఖర్చవుతుందండి?" అని అడిగాను.

"దానికే ముంద"ని ఆ అమ్మాయి వివరం చెప్పి, చివరగా చిన్న సందేహం వెలిబుచ్చింది, "ఎందుకు ఇక్కడ ఎదుటివారి జీతం గురించీ, జీవితం గురించీ తెలుసుకోవాలని ప్రయత్నిస్తుంటారు?".

నాకు నిజమే అనిపించింది. రెండోది భారతదేశం లో కూడా అనుభవమే కాని మొదటిది మాత్రం అక్కడ అంతగా కనిపించదు. అవతల మనిషి చదువు, చేసే ఉద్యోగం మనకి సంబంధం లేకపోయినా, జీతం గురించి కనుక్కోవడం మాత్రం మర్చిపోము. ఎందుకు?

నాకు తోచిన సమాధానం "పోటీ".

ఆ పోటీ మొదలు కోసం వెతికితే అక్కడ అసూయ కనిపించింది.

అలా అని నేను ఏ పోటీ కీ వ్యతిరేకి ని కాను. పోటీ లేకపోతే మనిషి ఎదుగుదల లేదని నమ్మేవారిలో మొదటి వాడను నేను. కానీ పోటీ అనేది ఒక మనిషిని పైకి తీసుకెళ్ళేదిగా ఉండాలి కాని అవతల మనిషిని కిందకి తొక్కేలా ఉండకూడదని నా ఉద్దేశ్యం.

"అదెలా సాధ్యం, పరిక్షలో నాకు మొదటి స్థానం వచ్చిందంటే ఎవరిదో నేను తీసుకున్నట్టేగా" అని మీరనవచ్చు. అందులో తప్పేమి లేదు, నా ఉద్దేశ్యం అది కాదు, "పరిక్షల్లో మంచి మార్కులు రావాలంటే మీరు బాగా చదవాలి, అంతే గాని ప్రక్కవాడ్ని పరిక్ష రాయకుండా చెయ్యకూడదు" అని అంతే. కారు కొనాలని షో రూమ్ కి వెళ్ళి మనకు నచ్చినది కాకుండా పక్కవాడి కంటే మెరుగైనది (మనకి అంతగా నచ్చకపోయినా) తీసుకునే దాకా ఈ పోటీ వెళ్ళకుంటే అదే చాలు.

---

మీ సూచనలు, అభిప్రాయాలు రచయిత సునీల్ దొడ్డపనేని కి తెలియచేయండి.
మీ అభిప్రాయాలు రచ్చబండ లో తెలియచేయండి